# బాలానందం కథ

-'సుధామ'

## అది 1940 వ సంవత్సరం

మద్రాసులో-రేడియోలో పిల్లలకార్యక్రమం కోసం, తమ చుట్టూ వున్న పిల్లల్ని పోగేసి, మా సంఘ స్థాపకులైన శ్రీ న్యాయపతి రాఘవరావు (అన్నయ్య), శ్రీమతి న్యాయపతి కామేశ్వరి (అక్కయ్య) గారలు శిక్షణ ఇస్తూండేవారు. పిల్లల్లోని సృజనాత్మక కళలు బయటకు రావాలంటే వారికి వేదిక ఒకటి అవసరం అని గట్టిగా కోరుకున్నారు వాళ్ళు. స్వయంగా బాలసాహిత్య రచయితలు కావడం వల్ల-పాటలు, నాటకాలు, సంగీతనాటికలు, ఏకపాత్రాభినయాలు రాసి పిల్లలచేత ప్రదర్శింపచేయడం వారికి సులువయ్యింది. అలా ఆంధ్ర బాలానందసంఘం మొదలయ్యింది.

ఏళ్ళుగడిచి రెండవప్రపంచయుద్ధం ముగియడంతో పరిస్థితులు మెరుగయ్యాయి. నగరంలోని వివిధ ప్రాంతాలనుండి పిల్లలు, వారి తల్లితండ్రులు కూడా బాలానందం కార్యక్రమాల్లో ఆసక్తి చూపసాగారు. ఆ ప్రోత్సాహంతో - ఉత్సాహంతో వస్తున్న వారందరినీ చేర్చి, సంప్రదాయ దసరాబొమ్మలకొలువునీ, సాంస్కృతిక ప్రదర్శనలనూ చేస్తే బాగుంటుందని అన్నయ్య అక్కయ్య భావించి, బాలల రంగస్థలానికి శ్రీకారం చుట్టారు. పిల్లల ఆనందం కోసం అలా రూపొందిందే 'బాలానందం' అయ్యింది.

ఆ సమయంలోనే మొట్టమొదటి పిల్లల పత్రిక 'బాల' ప్రచురణ మొదలైంది. తరువాతి కాలంలో 'చందమామ' వంటి పిల్లల పత్రిక రావడానికి అదే స్ఫూర్తి అయ్యింది. బాలానందం స్థాపకులే బాల పత్రికా సంపాదకులు కావడం వల్ల, బాలానంద సంఘం పిల్లల కార్యక్రమాల గురించి పత్రికలో కొన్నిపేజీలు కేటాయించారు. ఆ పబ్లిసిటి పాఠకుల్లో ఉత్సాహం పెంపొందించి, ఆంధ్రదేశంలో పిల్లలకోసం అనేక సంఘాలు స్థాపించేందుకు దోహదపడింది. 'బాలానందం' అంటే ఇంటింటా అందరికీ తెలిసింది. అందరికీ ప్రీతిపాత్రమైంది.

చెన్నైలో (అప్పుడు మద్రాసు) 'బాలానందం' కార్యక్రమాలు గొప్ప ఆసక్తిని పెంచుతూ, గొప్ప అభివృద్ధిని సాధించ సాగాయి. దానితో ఆసక్తిగల తల్లితండ్రులతో బాటు మా సంఘస్థాపకులు సంఘానికి ఒక మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పరచి, వ్యవస్థీకృతం చేయాలని సంకల్పించారు. బాలానంద సంఘ సంవిధానం ఎలావుండాలో శ్రీ కస్తూరిశేషగిరిరావుగారు, శ్రీదువ్వూరి నరసరాజుగారు, శ్రీ కందా భీమశంకరంగారు కలిసి రూపొందించారు. దానితో 'ఆంధ్రబాలానందసంఘం' రిజిస్టరై, చట్టబద్ధ రూపాన్ని పొందింది.

సంఘం నిర్వహించిన పిల్లల రంగస్థల కార్యక్రమాలకు ప్రతిభావంతమైనవని మంచిపేరువచ్చింది. ఎందరో పురప్రముఖులు, సినిమానిర్మాతలు, దర్శకులు బాలానందానికి స్వయంగా సన్నిహితులయ్యారు. బాలానందంలోని పిల్లల ప్రతిభాప్రాభవాలను వినియోగించుకోవడం పరిపాటైంది. ఆ రోజుల్లో సినిమాల్లో బాలపాత్రలు ధరించేవారంతా 'బాలానందం'లోని పిల్లలే అంటే అతిశయోక్తి కాదు.

శ్రీ నాగయ్య, శ్రీమతి భానుమతి రామకృష్ణ, శ్రీ బి.ఎన్.రెడ్డి, శ్రీ నాగిరెడ్డి, శ్రీ చక్రపాణి, శ్రీ కె.వి.రెడ్డి, శ్రీ డి.ఎల్.నారాయణ, శ్రీ.డి. మధుసూదనరావు, డా. రాజారావు, డా. అక్కినేని నాగేశ్వరరావు వంటి సినీప్రముఖు లందరికీ అందుకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

బాలానందం పిల్లల్లోని ప్రతిభను గుర్తించి – పిల్లలతోనే, అందునా పూర్తిగా బాలానంద సంఘ సభ్యులతోనే, పూర్తి నిడివి చలనచిత్రాన్ని 'బాలానందం' పేరుమీదే, అన్నయ్య, అక్కయ్య రచించగా నిర్మించిన శ్రీ.కె.ఎస్. ప్రకాశరావుగారికి మేం ప్రత్యేకించి ఎన్నటికీ ఎంతగానో కృతజ్ఞులం!

1952 లో సంఘ కార్యవర్గం పిల్లలసమస్యలపట్ల జనచైతన్యం కలిగించాలని తీర్మానించింది. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిసారిగా మునుపెన్నడూ లేనివిధంగా 'బాలలమహాసభ' ఆగస్టు నెలలో, మద్రాసులో, మైసూర్‌నుండి ప్రతినిధులుగా తరలివచ్చిన బాలబాలికలతో నిర్వహించడం జరిగింది.

కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ శిశుసంక్షేమ విభాగం సభ్యులు, ఆ శాఖ అధ్యక్షులు శ్రీమతి కృష్ణహతీసింగ్ సారధ్యంలో–1953 లో బాలానంద సంఘానికి వచ్చి, జరుగుతున్న కార్యక్రమాల పట్ల సంభ్రమాశ్చర్యాలు పొంది, మా సంఘ స్థాపకులైన శ్రీ న్యాయపతి రాఘవరావుగారిని తమ శాఖ సభ్యునిగా ఆహ్వానించి, చేర్చుకుని, పిల్లల అవసరాలు తెలుసుకునేందుకు దేశమంతా పర్యటనలు చేసారు.

బాలలసంక్షేమానికై మా సంఘసేవలను గుర్తించి న్యూఢిల్లీలోని కేంద్ర సాంఘిక సంక్షేమ విభాగం కార్య కలాపాల విస్తరణకై గ్రాంట్ విడుదలచేసింది. ఆ గ్రాంట్‌తో ఓ ప్రొజెక్టర్‌కొని, అప్పటి కార్మికమంత్రి శ్రీ వి.వి. గిరిచే ఒక ఫిలింక్లబ్‌ను ప్రారంభించాం. కేంద్ర సోషల్‌వెల్ఫేర్ బోర్డ్ అందచేసిన మరో 15 వేల రూపాయల గ్రాంట్‌తో ఒక 'వ్యాన్'ను కొని 'బాలానందం' పేరుతోనే ఒక సంచారగ్రంథాలయం, బొమ్మల లైబ్రరీని పిల్లలకోసం మొదలెట్టాం.

కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడడంతోనే 1954 లో 'రెండవ బాలలమహాసభలు' కర్నూల్‌లో నిర్వహించాం. ఆంధ్రగవర్నర్ శ్రీ సి.ఎం. త్రివేది సభలను ప్రారంభించగా, డిప్యూటీ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రభుత్వ మంత్రి వర్యులు శ్రీ దామోదరం సంజీవయ్య సారధ్యంలో కర్నూల్‌లోని ప్రముఖ వ్యక్తులు ఇరవైఒక్క మందితో ఏర్పడిన ఆహ్వాన సంఘం ఆంధ్ర, తెలంగాణ, మద్రాసు ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన ప్రతినిధులకు సాదర సదుపాయాలను సమకూర్చింది.

'మూడవ బాలలమహాసభ' – 1956 లో గుంటూరులో నాటి ముఖ్యమంత్రి డా. బెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడగానే ఆంధ్రబాలానంద సంఘం ప్రధానకేంద్రం హైదరాబాద్‌కు తరలించాలని, ఆ మహాసభలోనే తీర్మానించడం జరిగింది. 1956 జనవరి 1,2,3 తేదీలలో జరిగిన ఈ సదస్సు స్థానిక ఆహ్వాన సంఘానికి–ఆంధ్రకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ కందా భీమశంకర్‌గారు సారధ్యం వహించగా, ప్రధాన సదస్సును మేమే నిర్వహించాము. స్థానిక బాలానందసంఘం ఏర్పాట్లలో సహకరించింది. ఆ సదస్సులో పాల్గొనేందుకు బాలప్రతినిధులు, పిల్లల సంక్షేమ కార్యకర్తలు, చిత్తూరు, తిరుపతి, నర్సాపూర్, ఏలూరు, వైజాగ్, మదనపల్లి, బెంగుళూరు, హిందూపూర్, బాపట్ల, సత్తెనపల్లి, పాలకొల్లు, పోదూర్, పలమనేరు, బందరు, వేటపాలెం,

మద్రాసుల నుండి ఎందరో హాజరయ్యారు. బాలానందం సంచార గ్రంథాలయం వ్యాన్ -ప్రదర్శనా సామగ్రితో మద్రాసునుంచి వచ్చింది. ప్రత్యేకమైన రైలుబోగీలో మద్రాసు నుంచి గుంటూరుకు వందమంది పిల్లలు వచ్చారు. ఆరువేలమందికిపైగా బాలప్రతినిధులు ఆ సభల్లో పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలనున్న సంఘం కార్యవర్గ బృందంలో ప్రాతినిధ్యం వహించే అనుబంధ విభాగాల గురించి, సభల్లో ముఖ్యమైన తీర్మానాలను పాస్‌చేశారు. వివిధ శాఖల నిర్వహణకై ఒక ప్రాంతీయ నిర్వహణాధికారిని నియమించారు. ఆంధ్ర ఆదాయశాఖామాత్యులు ప్రతి పట్టణంలో, గ్రామంలో బాలానందసంఘాలు ఏర్పడడానికి సంపూర్ణ సహకారం అందిస్తామనీ, స్థలం కేటాయిస్తామనీ, అందుకు అవసరమైన చర్యలు తీసుకోగలమనీ వాగ్దానంచేశారు. ఈ సదస్సులు పిల్లల్లోనూ, పెద్దల్లోనూ కూడా గొప్ప చైతన్యం కలిగించాయి. రాష్ట్రంలోని వివిధ బాలానందసంఘాలు సంఘటితంకావడానికీ,పిల్లల్లో ఉదాత్తవిలువలకు, సాంస్కృతిక ప్రతిభలు అభివృద్ధిచెందే పథకాల రచనకూ తోడ్పడ్డాయి. ఒక మార్గదర్శక సంస్థగా 'ఆంధ్రబాలానందసంఘం' - గ్రామీణ బాలబాలికలకూ, వారికి సంబంధించిన విషయాలకు ప్రాధాన్యం ఇచ్చేలా సదస్సు చర్చించాలని భావించింది.

## హైదరాబాద్‌లో బాలానందం

**నా**టి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారి అభ్యర్థన మేరకు-బాలానంద సంఘాన్ని హైదరాబాద్‌కు తరలించాలన్న తీర్మానం వల్ల మదరాసులో ఆంధ్ర బాలానంద సంఘం శ్రీ డి.జి. శర్మ, శ్రీమతి దామెర్ల జోగులాంబ గార్లకు నిర్వహణ బాధ్యత అప్పగించి సంఘ స్థాపకులు హైదరాబాదుకు నివాసం మార్చారు -మదరాసు బాలానందంలో శ్రీ దామెర్ల శర్మ, శ్రీమతి జోగులాంబగార్లు ఎంతో బాధ్యతగా కార్యక్రమాలన్నీ నిర్వహించారు. ఈ నాటికీ మదరాసు బాలానందం శ్రీమతి దామెర్ల పద్మావతి నేతృత్వంలో, ఇతర కార్యవర్గ సభ్యుల సహకారంతో విజయవంతంగా నడుస్తోంది. ఇక హైదరాబాదులో బూర్గులవారి ఆసక్తి సహకారంతో బాలానందం స్థిరపడింది. నారాయణగూడ హైదరాబాద్‌లోని నెంబర్ 10, సి.ఐ.బి. స్పెషల్ క్వార్టర్స్-అద్దెకొనుగోలు పద్ధతిపై హౌసింగ్ బోర్డు-అక్కయ్య శ్రీమతి న్యాయపతి కామేశ్వరి గారి పేరున కేటాయించింది. అనంతరం సంఘంపేరున ఆవిడ రిజిస్టర్ చేయించారు. నాటినుంచి సంఘ కార్యకలాపాలు నారాయణగూడాలోని భవనంలో విజయవంతంగా సాగడం మొదలయింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణకు ఓ వారంరోజులు ముందుగానే 23 అక్టోబర్ 1956 లో హైదరాబాద్‌లో ఆంధ్రబాలానందసంఘాన్ని డాక్టర్ దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్ ప్రారంభించారు.

రాష్ట్రావతరణ అనంతరం నూతనోత్సహంతో-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో, 'నాల్గవ బాలల మహాసభలు' నిర్వహించడానికి సాంఘిక సంక్షేమశాఖా మాత్యులు శ్రీ.వి.బి. రాజుగారు ఆహ్వానసంఘం అధ్యక్షులుగా, స్థానిక స్వచ్ఛంద సంస్థలు ఏర్పాట్లను పర్యవేక్షించగా ఏర్పాట్లు జరిగాయి. దసరా సెలవుల్లో సభలు నిర్వహించాలని సంకల్పించినా, నవంబర్'14 బాలలదినోత్సవ వేడుకల్లో భాగంగా చేయాలని నిర్ణయించారు. జిల్లాలనుంచి వచ్చే ప్రతినిధులకు, ఎక్జిబిషన్ గ్రౌండ్స్‌లోని స్టాల్స్ వసతి సౌకర్యాలకై కేటాయించారు. బాలానందసంఘాల నియమావళిని ప్రతినిధులంతా కూడి ఏర్పరుచుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో రాష్ట్రంలోని ప్రతినిధులంతా పాల్గొన్నారు.

ఆకాశవాణి షార్ట్‌వేవ్ ట్రాన్స్‌మీటర్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని 1958 లో సికింద్రాబాద్, సీతాఫల్‌మండి జోనల్ విభాగాలు ఏర్పడ్డాయి. ఆ సందర్భంగా బాలానందసంఘం సభ్యులు ఓ నృత్యరూపకాన్ని ప్రదర్శించారు.

## జవహర్ బాలభవన్

1965-చెప్పుకోదగిన ఒక సంవత్సరం. బాలానందం కార్యక్రమాల స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వస్థాయిలో పిల్లలకోసం ఒక వినోద కేంద్రాన్ని ఏర్పరచాలని తలపోసింది. అందుకోసం పథకరచన, ఒకప్రణాళికకు అంతిమరూపం ఇవ్వమని మా వ్యవస్థాపకులను ఆహ్వానించింది. ఆ ప్రణాళికా రచనకు అనుగుణంగా రూపొందిందే-హైదరాబాద్ పబ్లిక్‌గార్డెన్స్‌లోని నేటి జవహర్ బాలభవన్.

## దశమవార్షికోత్సవాలు

1966 దసరారోజుల్లో హైదరాబాద్‌లో బాలానందసంఘం దశమవార్షికోత్సవాలు ఉత్సాహభరితంగా జరిగాయి. హైదరాబాద్‌లో పదేళ్ళ బాలానందంపై ఓ ప్రత్యేకసంచిక ఆ సందర్భంగా విడుదల చేశాం. రవీంద్ర భారతిలో వైవిధ్యభరితమైన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించాం.

## బాలానందం భవనం, హాలు

పిల్లల్లో సాంస్కృతిక విధాన వినోదాలకై మా సంఘం చేస్తున్న సేవలను గుర్తించి - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హౌసింగ్‌బోర్డునుంచి నారాయణగుడాలోని భవనాన్ని నేరుగా కొనుగోలు చేయడానికి రూ॥17,500/- గ్రాంట్ నిచ్చింది. ఆంధ్రప్రదేశ్ వెల్ఫేర్‌బోర్డ్ ఇచ్చిన నిధులతో అనంతరం ఒక చిన్న ప్రదర్శనశాల నిర్మాణం చేశాం. అప్పటి నుంచి జంటనగరాల్లో పిల్లలసాంస్కృతిక, ప్రదర్శనలకు 'బాలానందం హాలు' మంచివేదిక అయ్యింది.

## నాలుగుదశాబ్దాల బాలానందం

1981 లో రవీంద్రభారతిలో నలభైఏళ్ళ బాలానందం ఉత్సవాలు జరిగాయి. బాలానందం పాత, కొత్త సభ్యులు సమిష్టిగా సమర్పించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతిఒక్కరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.

## బాలానందం స్వర్ణోత్సవం

యాభైఏళ్ళ స్వర్ణోత్సవం వేడుకలు కూడా ఉత్సాహంగా జరిగాయి. అన్నయ్య అక్కయ్యలతో కలసి పనిచేసిన ఎందరో పాత సభ్యులకు ఈ సందర్భంగా సత్కారాలు చేశాం.

## ఫిలింక్లబ్

చక్రవర్తి చిత్రవారి 'సుడిగుండాలు' చలనచిత్రంలోని నృత్య రూపకంలో మా బాలానందసంఘం సభ్యులు పాల్గొనడం సంతోషదాయకమైన విషయం. ఇతర సినిమాలు కొన్నింటిలో బాలపాత్రలకు మా సంఘం పిల్లలు ధరించారు. మరోసారి సినీనిర్మాతలకు ప్రతిభావంతులైన బాలనటులను ఎంపిక చేసుకోడానికి 'బాలానందం' ఉపయుక్తమైంది. బాలానందంలో నెలనెలా 16 ఎం.ఎం. చిత్రప్రదర్శనలు ఆనవాయితీ అయ్యాయి.

## సెలవుల్లో విహారాలు

నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణానికి ముందే మా సంఘం పిల్లలు అక్కడ పర్యటించి సాంస్కృతిక ప్రదర్శననిచ్చారు. 1969 లో యాభై మంది సంఘ సభ్యులు - తోడు తీసుకుని పదిహేనురోజులు సెలవుల్లో వరంగల్ పరిసరప్రాంతాలు పర్యటించి వచ్చారు. ఈ పిల్లలను అక్కడ జనం స్వాగతించి, జిల్లాలో స్థానిక బాలానంద సంఘాల స్థాపనకు స్ఫూర్తిపొందారు. అవన్నీ మా బాలానంద సంఘానికి అనుబంధసంస్థలుగా మారాయి. రేడియోకార్యక్రమాల్లో, సాంస్కృతిక ప్రదర్శనల్లో పరస్పరం పిల్లలంతా ఏటేటా పాలుపంచుకుంటూనే వున్నారు.

ఆ ఏడే నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిథ్యం వహిస్తూ మరో బాలబృందం అంతర్జాతీయ పిల్లల ప్రదర్శనలో పాల్గొనేందుకు ఢిల్లీ తరలి వెళ్ళింది. ఈ పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలను అందరూ అభినందించగా, నాటి భారతరాష్ట్రపతి శ్రీ వి.వి.గిరి రాష్ట్రపతిభవన్‌కు వారిని ఆహ్వానించి తేనేటి విందునిచ్చారు.

1971 లో అఖిలభారతరంగస్థలవేడుకల్లో ఆంధ్రప్రదేశ్ పక్షాన పాల్గొనేందుకు ఆహ్వానించబడి, అప్పుడు మేం ప్రదర్శించిన 'స్నోవైట్ - ఏడుగురు మరుగుజ్జులు' నాటకం - మిగతా రాష్ట్రాలతో పోటీపడి, 'ఉత్తమప్రదర్శన' బహుమతిని అందుకుంది.

అంతేకాక యుద్ధసమయాల్లో 'జాతీయరక్షణ నిధి' కోసం విరాళాలసేకరణకై మా సంఘ పిల్లలు ఇచ్చిన ప్రదర్శనలు-పిల్లల్లోని దేశభక్తిని ప్రభుత్వం మెచ్చేలా చేశాయి.

అన్నయ్య అక్కయ్య దివంగతులయ్యేదాకా వారి సమర్థ మార్గదర్శకత్వంలో బాలానందం ఎంతగానో వికాసవంతమయ్యింది.

వారి మరణానంతరం బాలానందం కార్యవర్గ సభ్యులు, బాలానందం సభ్యులైన బాలబాలికలు, వారి ఆశయదీప్తిని శ్రీమతి కె. సుగుణమణి, డా. చిత్తరంజన్, శ్రీ పి. సూరిబాబు, శ్రీమతి కమల, శ్రీ ఎన్.వి. అశోక్ ఇతర పెద్దల నేతృత్వంలో కొనసాగించారు. ప్రస్తుతం వారి తరువాతి తరం బాలానందం సభ్యులు "బాలానందం" బాధ్యత భుజాలకెత్తుకుని విజయవంతంగా అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు. బాలబాలికల ప్రతిభాపాటవాలకు ఉత్సాహప్రోత్సాహాలనిస్తూ, వారి నైపుణ్యాలు పెంచుకునేందుకు సంఘం అవకాశాలనిస్తూ తోడ్పడుతోంది.

## అరవైఏళ్ళబాలానందం

2001 జనవరిలో రవీంద్రభారతిలో ఆనందోత్సాహాల మధ్య బాలానందం అరవైఏళ్ళ పండగ జరిగింది. పాత, కొత్త సభ్యులెందరో బిరబిరా తరలివచ్చారు. అరవై ఏళ్ళ బాలానందం ప్రగతిని రూపుకట్టిస్తూ డా. పద్మినీదేవి చిత్తరంజన్ వ్రాసిన పాట కార్యక్రమానికి మకుటాయమానంగా నిలిచింది. డాక్టర్ చిత్తరంజన్‌గారి సుమధుర సంగీతంలో - ఏడునుంచి డెబ్భైఏళ్ళ వయసువారంతా ఆ గీతమాలపించారు. బాలానందానికి అంకితమై సేవలొనర్చిన 'ఆణిముత్యాలు' సి.డి. ఆవిష్కరణ జరిగింది.

## న్యాయపతిరాఘవరావు (అన్నయ్య) శతజయంతి (ఏప్రిల్ - 2004 నుండి 2005 వరకు)

మా సంఘం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన కార్యక్రమం ఇది. అందుకోసం ప్రముఖులతో ముందుగా ఓ కమిటీ వేశాము. మనరాష్ట్రంలోనూ, దేశంలోనే కాక, విదేశాల్లోసైతం సభ్యులలో ఉత్సాహం ప్రేరేపించిన కార్యక్రమం ఇది. అమెరికాలోని పలు ఎన్.ఆర్.ఐ సంస్థలు సైతం ఈ వేడుకను నిర్వహించుకుని, ఎన్నో కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కావించాయి.

శ్రీమతి జంధ్యాల కామేశ్వరి, శ్రీ మలపాక పూర్ణచంద్రరావు ఈ వేడుకకు సమన్వయకర్తలుగా పనిచేశారు. బాలానందం కమిటీని-హాజరైన ప్రతి ఒక్కరూ అభినందించారు. ఇటీవల ఇంత సమర్థంగా నిర్వహింపబడిన కార్యక్రమం చూడలేదని కితాబునిచ్చారు. ఎంతో సంతృప్తినీ, సంతోషాన్ని కలిగించిన కార్యక్రమం అన్నయ్య శతజయంతి.

*ఏదాదిపొడుగునా జరిగిన కార్యక్రమాల క్రమం ఇది -*

★ **13 ఏప్రిల్ 2004** - ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో జవహర్ బాలభవన్ సమన్వయంతో శతజయంతి ఉత్సవాలకు శ్రీకారంచుట్టాం.

★ **2 ఆగస్టు 2004** - బాలానందం హాలులో అన్నయ్య రాసిన పాటలతో బృందగానం పోటీలు జరిగాయి. డెబ్భై అయిదుకు పైగా బాలబృందాలు, సంస్థలు ఈ పోటీలో పాల్గొన్నాయి.

★ **5,6 సెప్టెంబర్ 2004** - ఎన్.టి.ఆర్ కళామందిరం తెలుగువిశ్వవిద్యాలయంలో అన్నయ్య రాసిన నాటికల పోటీలు జరిగాయి. ఇరవై అయిదు బాలసంఘాలు పాల్గొన్నాయి.

★ **30, 31 అక్టోబర్ 2004** - 'కార్టూన్లు వేయడం ఎలా ?' అనే అంశంపై జంటనగరాల బాలబాలికల కోసం రెండురోజుల వర్క్‌షాప్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగింది. రాష్ట్రంలోని ప్రముఖ కార్టూనిస్టులు సహకరించిన ఈ అధ్యయనశిబిరంలో రెండువందల యాభై మంది పిల్లలు ఉత్సాహంగా భాగస్వాములయ్యారు.

★ **21 నవంబర్ నుంచి జనవరి 2005 వరకు** - ప్రతి ఆదివారం బాలబాలికలకు వివిధరకాల పోటీలు నిర్వహించడం జరిగింది. ఎనిమిదివందలమంది పిల్లలు వివిధపోటీలలో పోటీపడ్డారు.

★ **7 డిసెంబర్ 2004** - లలితకళాతోరణంలో ముప్పైమంది బాలబాలికలతో వయొలిన్ వాద్య సమ్మేళనం నిర్వహింపబడింది.

★ **2 జనవరి 2005** - విజయవాడ బుక్‌పబ్లిషర్స్-బాలానందసంఘం సౌజన్యంతో, అన్నయ్య శత జయంతి వేడుకలు చేశారు. బాలసాహిత్య రచయితలు, ప్రచురణకర్తలు ఎందరో పాల్గొన్నారు. పిల్లలకు మరింత ఆకర్షణీయంగా బాలసాహిత్య గ్రంథాలను రూపొందించడం ఎలా అన్న అంశంపై సదస్సులు జరిగాయి.

★ **10 నుండి 16 జనవరి 2005** - రంగస్థల ప్రముఖుల సహకారంతో - బాలానందం హాలులో 'థియేటర్ వర్క్‌షాప్' జరిగింది. నాటక ప్రదర్శనలకు సంబంధించిన పలు అంశాలపై సోదాహరణ ప్రసంగాలు, ప్రదర్శనలు జరిగిన ఈ కార్యక్రమంలో- ఎంపిక చేయబడిన 75 మంది పిల్లలు పాల్గొన్నారు.

★ **12, 13 మార్చి 2005** - బాలానందంహాలులో రాష్ట్రస్థాయి బాలసాహిత్య రచయితల సమావేశం జరిగింది. బాలసాహిత్యవికాసానికై తీసుకోవలసిన చర్యలపై సదస్సులో ప్రముఖ బాలసాహితీవేత్తలు పాల్గొని చర్చించారు.

## సమాపనోత్సవం

శతజయంతి సమాపనోత్సవం 2005 ఏప్రిల్ 23న రవీంద్రభారతిలో ఏర్పాటైంది. ఈ వేడుకలో పాలుపంచుకోవడానికి బాలానందసంఘం పూర్వసభ్యులెందరెందరో జంటనగరాలు నుండి, దేశం నలుమూలలనుండే కాకుండా, విదేశాలనుండి కూడా వచ్చారు. ప్రజాభిమానం చూరగొన్న ప్రముఖు లెందరో ఉత్సాహంగా తరలివచ్చి పాలుపంచుకున్నారు. ఈ వేడుకరోజున -

❖ కేంద్రప్రభుత్వం దయతో ఆమోదించి ముద్రించిన 'ఫస్ట్‌డే కవర్' ను పోస్ట్‌మాస్టర్ జనరల్ ఆవిష్కరించారు.

❖ హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం ప్రచురించిన అన్నయ్య శ్రీ న్యాయపతి రాఘవరావుగారి జీవిత చరిత్ర ఆవిష్కరణం జరిగింది.

❖ ఈ సందర్భంగా రూపొందించబడిన వెండినాణెం ఆవిష్కరణం.

❖ స్మారకసంచిక ఆవిష్కరణం.

❖ 'బాలానందం' పేరున అన్నయ్య రాసిన పాటలు, కథలు, నాటకాల సంకలన గ్రంథం విడుదల య్యింది.

❖ పిల్లలకోసం పిల్లలేపాడిన పిల్లలపాటల రెండు ఆడియో సి.డి.లు విడుదలయ్యాయి.

❖ అన్నయ్య అక్కయ్యలు స్థాపించిన తొలి పిల్లలపత్రిక 'బాల' సంచికల పునర్ముద్రణాగ్రంథం ఆవిష్కరణం ఒక అపురూప ఘటనం.

❖ అన్నయ్య రాసిన కథలతో 'బాలకథలు' పుస్తక ఆవిష్కరణం.

❖ 'అంకితం' పేరున రేడియో అన్నయ్యగారికి అంకితంగా వివిధరచయితలు రాసిన పిల్లలకథల గ్రంథావిష్కరణం చేశాం.

శ్రీ ఎన్.వి అశోక్ 'అన్నయ్య - బాలానందం' పేర ఒక ఛాయాచిత్రప్రదర్శన ఏర్పరిచారు.

# శ్రీమతి న్యాయపతి కామేశ్వరి (అక్కయ్య) శతజయంతి వేడుకలు (ఫిబ్రవరి 2008 - డిసెంబర్ 2008)

2008 ఫిబ్రవరిలో కర్ణాటక మాజీ గవర్నర్ శ్రీమతి వి.ఎస్.రమాదేవి గారు అక్కయ్య శతజయంతి వేడుకల 'లోగో'ను ఆవిష్కరించగా, ఆనందోత్సాహాలతో అక్కయ్య వందేళ్ళ పండుగ మొదలయ్యింది. దీనికి కూడా శ్రీమతి జంధ్యాల కామేశ్వరి, శ్రీ మలపాక పూర్ణచంద్రరావుగార్లు సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. ఆటలతో, తినుబండారాలతో 'ఆనందబజార్' పేర బాలానందం ఓ వేడుకను నిర్వహించింది.

సంవత్సరం పొడుగునా నెలనెలా తొంభైమంది పిల్లలకు 'ఆరాధన' అనే అనాథ శరణాలయంలో ఆహారం అందించడం జరిగింది. బాలానందం పిల్లలు ఇందులో తమ సహకారం అందించారు.

పదిహేనేళ్ళలోపు పిల్లలకు రాష్ట్రస్థాయిలో కథారచనపోటీ నిర్వహించడం జరిగింది. 'బాలకథామాల' పేర ఎన్నికైన 19 కథలను సంకలనంగా ప్రచురించడమైంది. రాష్ట్రంలోని వివిధజిల్లాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడం విశేషం! విజేతలకు సమాపనోత్సవం నాడు బహుమతులు, యోగ్యతాపత్రాలు ఇవ్వడం జరిగింది.

అన్నయ్యగారు రాసిన పిల్లలపాటలు 8-13 సం॥ లోపు పిల్లలు పాడగా-'బాలగేయాలు' పేర ఒక సి.డి.విడుదలయింది.

'బాలానందం-2' పేరున అక్కయ్య పిల్లలకు రాసిన కథలతో ఓ పుస్తకం ఆవిష్కరింపబడింది.

'కథలకు బొమ్మలువేయడం ఎలా' అన్నదానిపై ప్రముఖ చిత్రకారులు శ్రీ బాలి, శ్రీ సరసిగార్ల సహకారంతో రెండురోజుల అధ్యయన శిబిరం నిర్వహించగా-జంటనగరాల్లోని వందమంది పిల్లలు పాల్గొన్నారు. ప్రతిభా వంతులైన 14 మంది బాలచిత్రకారులను ఎన్నుకుని, 'బాలకథామాల', 'అక్కయ్య కథలు' పుస్తకాల్లోని కథలకు వారిచేత బొమ్మలు వేయించి ప్రచురించాం. ఆ బాలచిత్రకారులకు యోగ్యతా పత్రాలు, జ్ఞాపికలు వేడుక దినాన ప్రదానం చేయడమైంది.

ప్రముఖ వ్యక్తులు రాయగా అక్కయ్య వ్యక్తిత్వ సాహిత్యాల గురించిన వ్యాసాలతో ప్రత్యేక సంచిక రూపొందించి ప్రచురించాం.

ఆస్ట్రేలియాలోని 'మెల్‌బోర్న్'లో కూడా రేడియో అక్కయ్య శతజయంతి సభ జరిగింది. మెల్‌బోర్న్‌కు చెందిన పిల్లలు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. అన్నయ్య, అక్కయ్య రాసిన సంగీత రూపకాలు, నాటికలను పిల్లలు ప్రదర్శించారు. బాలానందసంఘంతోనూ, అన్నయ్య అక్కయ్యలతోనుగల అనుబంధాలను పెద్దలు స్మరించుకున్నారు.

## అక్కయ్య శతజయంతి ముగింపు సభ

రవీంద్రభారతిలో 2008 డిసెంబర్ 24న అక్కయ్య శతజయంతి వేడుకల ముగింపు సభ జరిగింది. జంటనగరాలు, రాష్ట్రం, దేశంలోని పూర్వ బాలానంద సభ్యులే కాక - అమెరికా, ఆస్ట్రేలియాలనుండి కూడా ఈ వేడుకల్లో పాల్గొనేందుకు సభ్యులు వచ్చారు.

ఈ సందర్భంగా బాలానంద సంఘం పలు ఆవిష్కరణలు కావించింది.

1. శతజయంతి వేడుకల వెండినాణెం.
2. పిల్లలు రాసిన కథలకు బాలచిత్రకారుల బొమ్మలతోనే ముద్రించిన 'బాలకథామాల' సంపుటి విడుదల.
3. అక్కయ్య కథలు 'బాలానందం-2' పిల్లల కథలకు పిల్లల బొమ్మలతో గ్రంథావిష్కరణం.
4. శతజయంతి ప్రత్యేక సంచిక
5. అన్నయ్య రాసిన పిల్లలపాటలు పిల్లలే పాడగా విడుదలచేసిన 'బాలగేయాలు' మ్యూజికల్ ఆల్బమ్ సి.డి. విడుదల.

శ్రీ ఎన్.వి. అశోక్ రూపొందించి ప్రదర్శించిన అక్కయ్య జీవితచరిత్ర ఛాయాచిత్ర ప్రదర్శనం.

## నేటి బాలానందం

పిల్లలు తమ సృజనాత్మక ప్రతిభాశక్తులు ఆవిష్కరించుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ, 'బాలానందం' నేటికీ తన నిరంతర కృషి కొనసాగిస్తూ వుంది. 'బాలానందం ట్రస్టు' నెలకొల్పి - నిధులను, కార్యక్రమాలను క్రియాశీలంగా నిర్వహిస్తున్నాం. ట్రస్ట్‌బోర్డ్ సభ్యులుగా బాలానందం ఆశయాలకు అంకితమైవున్న పూర్వ సంఘ సభ్యులు వ్యవహరిస్తున్నారు.

వదాన్యుల సహకారంతో నారాయణగూడాలోని బాలానందభవనం పూర్తిగా పునర్నిర్మాణమయ్యింది. ఈ విషయంలో శ్రీమతి. వై. లలితా మూర్తి, శ్రీ పరుచూరి హనుమంతరావు, శ్రీ ఆత్మారాం, శ్రీ కె.ఇ. వరప్రసాదరెడ్డి, శ్రీ జంధ్యాల సిద్ధార్థ గార్లకు మా ప్రత్యేక కృతజ్ఞతలు. వారి ఆర్థిక, హార్దిక సహకారమే భవన నిర్మాణాన్ని సానుకూల పరిచింది.

భరతనాట్యం, కర్ణాటక సంగీతం, డ్రాయింగ్ మరియు పెయింటింగ్‌ల్లో శిక్షణాతరగతులు క్రమబద్ధంగా జరుగుతున్నాయి.

మా భరతనాట్యం విద్యార్థులు జంటనగరాల్లోనే కాక ఇతరత్రా కూడా అనేక ప్రదర్శనలు ఇచ్చారు.

+ తంజావూరు బృహదీశ్వరాలయంలో జరిగిన అంతర్జాతీయ నృత్యోత్సవంలో పాల్గొన్నారు.
+ కూచిపూడి అగ్రహారంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన నృత్య వేడుకల్లో ప్రదర్శనలిచ్చారు.
+ 2012 తిరుపతిలో జరిగిన ప్రపంచతెలుగుసదస్సులో నృత్య ప్రదర్శన చేశారు.
+ లలితకళాతోరణంలో జరిగిన రాష్ట్ర సాంస్కృతికోత్సవాల్లో పాల్గొన్నారు.

స్థానిక సంస్థలు నిర్వహించిన పలు కార్యక్రమాల్లోకూడా పాలుపంచుకున్నారు.

బాలానందం వార్షికోత్సవాల్లో, ఇతర వేడుకలవేళ రంగస్థలంపై వారు నృత్య ప్రదర్శనలిస్తున్నారు. ఎందరో విద్యార్థులు తమ ప్రాథమికవిద్యను విజయవంతంగా పూర్తి చేసుకుని రవీంద్రభారతిలో 'ఆరంగేట్రం' జేశారు.

రాష్ట్రంలోని ప్రముఖ చిత్రకారులు అభినందించేలా-డ్రాయింగ్ మరియు పెయింటింగ్ విభాగానికి చెందిన మా పిల్లలు, చక్కని 'చిత్రకళా ప్రదర్శనలు' కావించారు. వివిధ పోటీల్లో పాల్గొని, తమ ప్రతిభకు పురస్కారాలు అందుకున్నారు. బాలానందం, ఇతర సంస్థలు ఏర్పరచిన అధ్యయన శిబిరాల్లో పాల్గొని తమ ప్రతిభ చూపారు. బాలానందం ప్రచురించిన 'అక్కయ్య కథలు', 'బాలకథామాల' గ్రంథాలలోని రచనలకు బొమ్మలు వారు సంతరించినదే.

మా సంఘం కర్ణాటక సంగీత విద్యార్థులు - రేడియోకార్యక్రమాల్లో, పలు సాంస్కృతిక వేదికలపై పాల్గొన్నారు.

దశాబ్దాల క్రితమే ప్రారంభించిన వార్షిక రంగస్థల వేడుకలు ప్రతి ఏటా నిర్వహిస్తూనే వున్నాం. వివిధ అంశాలలో నిర్వహించే ఈ పోటీలలో జంటనగరాలకు చెందిన బాల బాలికలెందరో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

వివిధ పోటీలు అన్నీ కూడా తెలుగులోనే జరుగుతాయి.

బహుమతి గ్రహీతలకు వార్షికోత్సవం నాడు విజయోత్సవ జ్ఞాపికలందిస్తాం.

వేసవి సెలవుల్లో వేసవి శిబిరాలు మరో ఆకర్షణీయ కార్యక్రమం. ప్రతిఏటా సెలవులను వినోదవికాసమయం కావించుకునేందుకై పిల్లలకు సదాశయంతో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలివి.

మధురమైన బాల్యం పిల్లలందరూ పొందాలన్న ఒకేఒక్క సదాశయంతో నిర్వహింపబడుతున్న ఈ సంస్థకు ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్థిక సహకారమూ లేదు. ఇతరత్రా కూడా సంస్థలనుండి ఆర్థికబలం ఏమీ అందుకోవడంలేదు. లాభాపేక్షలేని స్వచ్ఛంద కృషి మాది.

మా ప్రధాన ఆశయం-చిన్నవయసు పిల్లలందరూ వారికి తగిన సాహిత్యం అందుకోవాలనీ, వారి ప్రతిభా పాటవాలను ప్రదర్శించుకునే అవకాశాలను అందిపుచ్చుకోగలగాలని. తెలుగు పిల్లలందరికీ తెలుగు చదవటం, రాయడం, మాట్లాడటం, తెలుగులో ఆలోచించడం రావాలన్నది మా ప్రగాఢ ఆకాంక్ష. అన్నయ్య అక్కయ్య-పిల్లలు తమ మాతృభాషను గౌరవిస్తూ, ఆ భాషను నేర్వాలని కోరుకునేవారు. వారి అభిలాష మేరకే సంఘ కార్యక్రమాలు, పోటీలు అన్నీ తెలుగులో మాత్రమే నిర్వహిస్తున్నాం.

పిల్లలసేవలోనే డెబ్బై అయిదు సంవత్సరాలు గడిచిపోయాయి. సంఘ వ్యవస్థాపకుల ఆదర్శాలు మొక్కపోనీకుండా, వారి ఆశయ దీప్తిని పరివ్యాప్తం చేస్తూ, వారు వేసిన పునాదులపైనే-కార్యక్రమాలను అభివృద్ధి పరుస్తూ నిర్వహిస్తున్నామని మేం గర్వంగా తెలియచేసుకుంటున్నాం !

మీ అందరి సహాయ సహకారాలతో-దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ సంస్థ, భవిష్యత్తులో మరెంతోకాలం విజయపథంలో పురోగమించగలదని విశ్వసిస్తున్నాం.